క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి

దెందులూరు: మలకచర్ల, రామారావుగూడెం లో పార్టీ పరిస్థితులను మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి దృష్టికి పార్టీ సీనియర్ నాయకులు టి.బాబ్జి తీసుకువెళ్లారు. సమన్వయంతో సమష్టిగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అబ్బయ్యచౌదరి బాబ్జితో పాటు నాయకులకు సూచించారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అబ్బయ్యచౌదరిని కలిసి కూటమి ప్రభుత్వం ఏర్పాటు అనంతరం నెలకొన్న సమస్యలను బాబ్జీ వివరించారు.

దెందులూరు సీహెచ్‌సీలో తహసీల్దార్ తనిఖీ



దెందులూరు సీహెచ్‌సీలో సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న తహసీల్దార్ బి.సుమతి

దెందులూరు: దెందులూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను మంగళవారం తహసీల్దార్ బి.సుమ తి పరిశీలించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో 30పడకలతోపాటు అన్ని విభాగాల వైద్యు లు, వైద్యసిబ్బంది సంతృప్తికరమైన సేవలందిస్తున్నారని సూపరింటెండెంట్ సుందర్‌బాబు అన్నారు. రూ.2.50 కోట్లతో సీహెచ్ సీని ఆధునీకరించామని, గతంతో పోల్చితే ప్రస్తుతం అవుట్ పేషెంట్ల ఓపీ 150కు చేరిందన్నారు. గ్రామంలో ప్రజలు దెందులూరు వైద్య సిబ్బంది, వైద్యులపై మంచి అభిప్రాయంతోనే ఉన్నా రని సూపరింటెండెంట్‌తో తహసీల్దార్ అన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో అన్నదానం



అప్పనవీడులోని అభయాంజనేయస్వామి ఆలయంలో దాతలను సత్కరిస్తున్న అర్చకులు

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయ స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి హనుమాన్ జంక్షన్ గ్రామానికి చెందిన పొట్ల వెంకటరత్నం, శ్యామలాదేవి కుమారుడు, కుమార్తె, మనవరాలు తరఫున ఆర్థిక సాయం అందించారు. ఈకార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, గొడుగుల పంపిణీ



విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న దృశ్యం

గణపవరం: తమ సంస్థ లాభాల నుంచి కొంత భాగం సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నట్లు ముత్తూట్ ఫైనాన్స్ జోనల్ మేనేజర్ కె.కన్నబాబు అన్నారు. మంగళవారం గణపవరంలోని 6వ వార్డు, -1 ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, గొడుగులు, నోటు పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థుల చదువుకు తమ వంతు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ వి.రాజేష్, సత్య, లోకేష్ వంశీ, ఎంఈవోలు పుచ్చల శేషు, జి.బాలయ్య, హెచ్‌ఎంలు జాలెం నానీ, మూరా చిన్నేసు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

దెందులూరు: ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు ఎమ్మెల్యేను కలిశారు. సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. మండల మాజీ ఎంపీపీ కొడాలి ఆంజనేయచౌదరి, మండల పార్టీ అధ్యక్షులు మాగంటి నారాయణప్రసాద్ (మిల్లుబాబు), బొప్పన సుధ తదితరులు ఉన్నారు.

సంతానలక్ష్మిగా సౌభాగ్యలక్ష్మి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సత్రంపాడులోని సౌభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక కుంకుమ పూజ అనంతరం మంగళగౌరీ వ్రతాలను ఆచరించారు. అమ్మవారికి సంతానలక్ష్మి అలంకరణ చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



అప్పనవీడులో మానవత సేవాకార్యక్రమాన్ని ప్రారంభించిన అడుసుమిల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు



భీమడోలులో మానవహారంగా ఏర్పడి శాంతి ప్రదర్శన చేస్తున్న మానవత సభ్యులు, విద్యార్థులు

పెదపాడు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని దీపక్ నెక్స్‌జెన్ మేనేజింగ్ డైరెక్టరు అడుసుమిల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. మంగళవారం అప్పనవీడులోని మానవత సంస్థ కార్యాలయంలో పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్లాస్టిక్ లేని సమాజం మనం చూడగలమో లేదోనని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. భావితరాలకు ప్లాస్టిక్ రహిత సమాజాన్ని అందించాలని చెప్పారు. ఈకార్యక్రమంలో కైకలూరు మానవత అధ్యక్షుడు కొండ్రెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ పర్యవరణాన్ని పరిరక్షించేందుకు ఇళ్లల్లో జరిగే కార్యక్రమాల్లో ప్లాస్టిక్ సామగ్రి వినియోగాన్ని తగ్గించాలనే ఉద్దేశ్యంతో స్టీల్ భోజనం ప్లేట్లు, టిఫిన్ ప్లేట్లు, మంచి నీటి గ్లాసులు ఉచితంగా అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు గూడపాటి జయరామచంద్రరావు, కార్యదర్శి పాబోలు గణేష్ బాబు, జేవీవీ సత్యన్నారాయణ, ఏలూరు మానవత సభ్యులు అడుసుమిల్లి నిర్మల, మేడికొండ పద్మజ, తాడి రంగారావు పాల్గొన్నారు.

ఉత్తమ సమాజ స్థాపనలో భాగస్వాములు కావాలి

భీమడోలు: ఉత్తమ సమాజ స్థాపనే లక్ష్యంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పని చేస్తుందని పలువురు వక్తలు అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల శాఖ ఆధ్వర్యంలో భారీ శాంతి ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. భీమడోలు ఉన్నత పాఠశాల వద్ద ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని అక్కడ నుంచి భీమడోలు జంక్షన్ చేరుకున్నారు. మానవత జెండాలను పట్టుకుని ప్రపంచ శాంతి వర్ధిల్లాలి అంటూ నినదిస్తూ పురవీధుల్లో ర్యాలీ, ప్రదర్శన చేశారు. భీమడోలు జంక్షన్‌లో మానవ హారంగా ఏర్పడి నినాదాలు చేసారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు, బిస్కెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు, జిల్లా కోఆర్డినేటర్ రామిసెట్టి గంగాధర్, మండల అధ్యక్షుడు గుడివాడ సీతారామాంజనేయులు, జిల్లా ప్రతినిధులు పసుపులేటి సాంబశివరావు, అల్లాడ ప్రసాద్, ఆర్‌డీఎం ప్రసాద్, తుమ్మల ఉమామహేశ్వరరావు, మానవతావాదులు, విద్యార్థులు, టీచర్లు పాల్గొన్నారు.

శాంతియుత సమాజస్థాపనే మానవత లక్ష్యం

గణపవరం: సమాజంలో శాంతిని పెంపొందించి, ప్రజలంతా ఐకమత్యంగా జీవించేలా శాంతియుత సమాజస్థాపనే మానవత సంస్థ లక్ష్యమని మానవత రాష్ట్ర విస్తరణాధికారి జానకిరామరాజు, రీజియన్ చైర్మన్ కాకర్ల వినాయక అన్నారు. మంగళవారం గణపవరం, నిడమర్రు మండలాల మానవత సంస్థ ఆధ్వర్యంలో మానవత శాంతి వారోత్సవాల్లో భాగంగా గణపవరంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో శాంతి నెలకొల్పడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు, పచ్చదనం పెంపుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఈ దిశగా మానవత సంస్థ చేస్తున్న కృషికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. మానవత సంస్థ లక్ష్యం శాంతియుత సమాజ స్థాపనేనని, ప్రజల ఐకమత్యంతోనే ఇది సాధ్యమన్నారు. ఈ సందర్భంగా సుమారు 400మంది విద్యార్థులతో తహసీల్దార్ కార్యాలయం వరకూ ప్రదర్శన నిర్వహించారు. శాంతియుత సమాజ స్థాపనలో మేమంతా బాధ్యతగా కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో మండల మానవత అధ్యక్షుడు బుద్దారపు పుల్లయ్య,కార్యదర్శి మానేపల్లి చిరంజీవి, మాజీ అధ్యక్షుడు వంకాయల రామారావు, విద్యావేత్త సీహెచ్ నాగేశ్వరరావు, మానవత సభ్యులు పెరుమాళ్ల ఆంజనేయులు, బొడ్డు శ్రీనివాసరావు, సాతసాటి శీతారామరాజు, అడ్డాడ రామకృష్ణంరాజు, సాగిరాజు సుబ్బరాజు, దండు బంగార్రాజు, సన్నాల శంకరావు, కూనసాని నాగేశ్వరరావు, శేగా వీరనాగయ్య, నమ్మి అప్పారావు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

దెందులూరు: మండలంలో 9 మంది సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు ఇచ్చామని దెందులూరు ఎంపీడీఓ వీ.శ్రీలత అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఇటీవల జిల్లా పంచాయతీ అధికారి దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారన్నారు. హాజరు నమోదు చేయకుండా, యూనిఫాం ధరించని వారు, శాఖాపరమైన విధి నిర్వహణ తెలియని 9 మంది సచివాలయ ఉద్యోగులను గుర్తించామన్నారు. సమీక్ష సమావేశంలో డీపీఓ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి వారికి షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఆదేశించారన్నారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు 9 మంది సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని ఎంపీడీఓ అన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

గణపవరం: స్థానిక చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కంప్యూటర్ సైన్సు సబ్జెక్టు బోధించడానికి అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపల్ నిర్మలకుమారి తెలిపారు. అభ్యర్థులు ఎంఎస్సీ కంప్యూటర్స్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, పీహెచ్‌డీ లేదా నెట్ లేదా స్లెట్ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తికలిగిన అభ్యర్థులు ఈనెల 27లోగా తమ దరఖాస్తులను కళాశాల కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. తర్వాత మౌఖిక పరీక్షకు హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 7901056668 ఫోన్ నంబరును సంప్రదించాలని ఆమె సూచించారు.

విద్యార్థుల్లో ఐరన్ లోపాన్ని గుర్తించండి



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న కాగుపాడు పీహెచ్‌సీ డాక్టరు మానస

ఉంగుటూరు: రక్తంలో ఐరన్ లోపం లేకుండా చేయడమే అనీమియా ముక్తి భారత్ ఉద్దేశ్యమని కాగుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టరు మానస అన్నారు. మంగళవారం ఉంగుటూరు విద్యాశాఖ కార్యాలయంలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. డాక్టర్ మానస మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు ఐరన్ లోపం వల్ల ఏరకమైన ఇబ్బంది కలగకుండా ముందస్తుగా విద్యార్థులు అందరి నుంచి రక్త నమూనాలు సేకరించి మూడు నెలలకు ఒకసారి ప్రగతి పరిశీలించి మూడు భాగాలుగా వారిని గుర్తించి ప్రత్యేకమైన చికిత్స అందించడం ద్వారా పిల్లలందరినీ ఆగోగ్యవంతులుగా తీర్చిదిద్దవచ్చునని వివరించారు. ఈ కార్యక్రమం డీవైఈవో రవీంద్రభారతి పర్యవేక్షణలో స్థానిక నం- 1 పాఠశాల హెచ్‌ఎం శిరిమామిళ్ల పెద్దిరాజు, ఆరోగ్య విస్తరణ అధికారి కె. శ్రీనివాసరావు, హెల్త్ విజిటర్ సుబ్బలక్ష్మి, సూపర్‌వైజర్ సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బీవీ శ్రీలక్ష్మి, శారదమణి, సీఆర్పీలు నరేంద్ర కుమార్, విష్ణుమూర్తి, నారాయణ, రవికిషోర్ మరియమ్మ శ్రీదేవి పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై ఆకస్మిక దాడులు

భీమడోలు: భీమడోలు ఎస్‌ఈబీ పరిధిలోని ఉంగుటూరు మండలంలో మంగళవారం బెల్ట్ షాపులపై జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. మండలంలోని ఉంగుటూరు, కైకరం గ్రామాల్లోని బెల్ట్ షాపులపై వారు దాడుల చేశారు. ఉంగుటూరు మండలంలో దూసనపూడి పాండురంగారావు నుంచి 31 మద్యం సీసాలు, కైకరంలో కేతినేని పవన్‌కుమార్ నుంచి 10 మద్యం సీసాలను సంబంధిత అధికారులు పట్టుకున్నారు. ఇద్దరు వ్యక్తులతో పాటు మద్యం సీసాలను అధికారులు భీమడోలు ఎస్‌ఈబీకి అప్పగించారని సీఐ గిరిజ సత్యకుమారి తెలిపారు. వారిపై కేసులు నమోదు చేస్తామని ఆమె పేర్కొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో భవిష్యత్తుకు విఘాతం



వివేకానంద జిల్లా పరిషత్ హైస్కూల్లో మాట్లాడుతున్న జిల్లా అధికారి డాక్టర్ పాల్ సతీష్

ఉంగుటూరు: మాదక ద్రవ్యాలు వాడటం వల్ల మానసిక, ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని, జీవితం అంధకారంగా మారిపోతుందని జిల్లా డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ సతీష్ అన్నారు. మంగళవారం నారాయణపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో మాదక ద్రవ్యాలు వాడటం వల్ల జరిగే నష్టాలను, ఉత్పన్నమయ్యే మానసిక సమస్యలను వివరించారు. మత్తు పదార్థాలకు బానిసలు అయితే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. భారతదేశంలో నాసా భారత ముక్త అభియాన్ కార్యక్రమం ద్వారా 13నుంచి 15 సంవత్సరాలు కలిగిన విద్యార్థులను చైతన్యపరిచే కార్యక్రమం 272 జిల్లాల్లో చేపట్టినట్టు వెల్లడించారు. రాష్ట్రంలో ఎంపిక చేసిన నాలుగు జిల్లాల్లో పశ్చిమగోదావరి ఉందని తెలిపారు. కార్యక్రమంలో చేబ్రోలు పీహెచ్‌సీ డాక్టరు వర్మ, హెల్త్ ఆఫీసరు రత్నరాజ్యం, ఆరోగ్య కౌన్సిలర్ కోట శ్రీనివాస్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఇరువైపులా అండర్‌పాస్‌కు పై కప్పు





దెందులూరు-అలుగులగూడెం మధ్య రెండువైపులా అండర్ పాస్ రక్షణగా రేకులతో ఏర్పాటు చేసిన పైకప్పు

దెందులూరు: దెందులూరు- అలుగులగూడెం రైల్వేట్రాక్ అండర్‌పాస్‌కు రెండు వైపులా పై భాగంలో రక్షణగా రేకులతో పైకప్పుతో పాటు పక్క భాగాల్లో సైతం వర్షపు జల్లు, ఎండ రాకుండా రేకులు ఏర్పాటు చేశారు. దెందులూరు వైపు, అలుగులగూడెం వైపు పై భాగం రేకు ఏర్పాటు చేయడంతో ఇక నుంచి వర్షపు నీరు అండర్ పాస్ లోకి నీరు చేరే అవకాశం ఎంత మాత్రం లేదు. ఇప్పటి వరకు అండర్‌పాస్‌లో ఉన్న వర్షం నీటిని తొలగించేందుకు రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణీకులు, వాహనాదారులు కోరారు. ప్రస్తుతం రెండువైపులా రేకుల షెడ్డు నిర్మించడంపై వైఎస్సార్‌సీపీ, కూటమి నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, అన్ని గ్రామాల ప్రజలు రైల్వే అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ఏలూరు టౌన్: నగరంలో వాహనదారులు విధిగా డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉండాలని, సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుంటే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఏలూరు టూటౌన్ సీఐ వైవీ రమణ అన్నారు. ఏలూరు టూటౌన్ పరిధిలోని అశోక్‌నగర్ కేపీడీటీ, ఆర్‌ఆర్‌పేట సుబ్బమ్మదేవి నగరపాలకోన్నత పాఠశాల ప్రాంతాల్లో వాహన తనిఖీల స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. పీడీబీటీ కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై ఆయన అవగాహన కల్పించారు. మైనర్లు రోడ్లపై మోటారు సైకిళ్లను నడపటం నేరమని, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, ఇష్టారాజ్యంగా మోటారు సైకిళ్లు నడిపితే మోటారు సైకిల్ యజమానిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్సైలు మదీనాబాషా, సాధిక్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి



భీమడోలులో చెత్త నుంచి సేంద్రియ ఎరువుల తయారీ ప్రక్రియను తెలుపుతున్న సిబ్బంది

భీమడోలు: చెత్త నుంచి సంపద సృష్టించడం ద్వారా పంచాయతీలు ఆర్థిక స్వావలంబన సాధిస్తాయని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతి అన్నారు. భీమడోలు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు విధులు, బాధ్యతల, పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు అనే అంశంపై నిర్వహిస్తున్న సమావేశాలు రెండోరోజైన మంగళవారం నిర్వహించారు. భీమడోలులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని వారంతా సందర్శించారు. వారికి పంచాయతీల్లో పొడి, తడి చెత్తలను సేకరించి వాటిని ప్రత్యేక యంత్రాల్లో వేసి వాటిని సేంద్రియ ఎరువుగా మార్చే ప్రక్రియపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సీహెచ్ పద్మావతి, ఈవోఆర్‌డీ ఏ.సుందరిలు మాట్లాడుతూ పంచాయతీలు అభివృద్ధి పథకంలో నడిపించేందుకు తగిన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామకార్యదర్శులు, క్లాప్ మిత్రలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై నివేదిక



భీమవరంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మకు నివేదికను అందిస్తున్న ప్రతినిధుల బృందం

భీమడోలు: 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై తయారు చేసిన నివేదికను మంగళవారం ఫాన్సా అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థల బృందం కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మకు సమర్పించారు. దేశ వ్యాప్తంగా 11 రాష్ట్రాల్లో ఒకొక్క రాష్ట్రంలో 5 గ్రామ పంచాయతీలను ఎంపిక చేసుకుని ఆర్థిక సంఘం నిధులను ఏ విధంగా వినియోగించుకున్నది ఆ బృందం పరిశీలన చేసింది. గ్రామాల్లో మంచినీరు, పారిశుధ్యం తదితర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించి ఓ నివేదికను తయారు చేసింది. భీమవరంలో కేంద్ర మంత్రికి ఆ నివేదికను బృందం సభ్యులు రాజారావు, భీమడోలు చైతన్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పాము మాన్‌సింగ్, చెరుకూరి శ్రీనివాస్, జ్ఞాన కుమార్ అందించారు.

డిగ్రీ ప్రవేశాల రిజిస్ట్రేషన్‌కు గడువు పెంపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో వివిధ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు గడువు పెంచినట్టు ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో పాటు కళాశాల, కోర్సుల ఎంపికను ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకూ ఆన్‌లైన్ చేసుకోవాలని సూచించారు. ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ హిస్టరీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ మ్యాథమెటిక్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు కళాశాలలో ఏర్పాటు చేసిన ఉచిత సహాయ కేంద్రంలో సంప్రదించవచ్చని తెలిపారు.

హామీలను అమలు చేయాలి

జంగారెడ్డిగూడెం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు డిమాండ్ చేశారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆఫీస్ బ్యారర్ల సమావేశం కేవీ రమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీల అమలుపై, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి అంశాలపై చర్చించి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణ చేస్తామని చంద్రబాబునాయుడు ప్రకటించి ఇంతవరకు అమలు చేయలేదని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకటరావు విమర్శించారు. లక్షలాదిమంది నిర్మాణ కార్మికులకు ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు కాలేదని, వారికి వెంటనే సంక్షేమ పథకాలు అమలయ్యే విధంగా ప్రభుత్వం సంక్షేమ బోర్డుని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ మాట్లాడుతూ ఏలూరు జిల్లాకు ఇసుక ర్యాంపు లేదనే పేరుతో నిర్మాణ యజమానులకు ఇసుక దొరకకుండా చేస్తున్నారన్నారు. దీని వలన జిల్లాలో రెండు లక్షల మంది నిర్మాణ కార్మికులు ఎటువంటి పనులు లేకుండా రెండు నెలలుగా పస్తులుంటున్నారని పేర్కొన్నారు. అధికార పార్టీల నాయకులు ప్రజా ప్రతినిధులు తక్షణ స్పందించి జిల్లాకు నాణ్యమైన ఇసుకను అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు సరియం రామ్మోహన్ మాట్లాడుతూ తల్లికి వందనం పేరుతో ఇస్తానన్న రూ.15వేలు ప్రభుత్వం త్వరగా విడుదల చేయాలన్నారు.

చీరలు, పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందుకున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో శివానుసూయ విద్యానిధి ఫౌండేషన్ స్థాపించి 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం స్థానిక ఆర్ఆర్ పేటలో ఉన్న గోసంరక్షణ సమితి ప్రాంగణంలో మహిళలకు చీరలు, విద్యార్థినులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ నగరంలో శివానుసూయ విద్యానిధి ఫౌండేషన్ చేస్తున్న సేవలు ఎందరో పేదల జీవితాల్లో వెలుగునిస్తున్నాయని అన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు మునగాల మురళీకృష్ణ, విజయలక్ష్మి దంపతులను సన్మానించారు. ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం సాయి సుమంత్, డైరెక్టర్ ఎం.సాయి ప్రశాంత్, మానవత సంస్థ ప్రతినిధి ఆలపాటి నాగేశ్వరరావు, గోసంరక్షణ సమితి ట్రెజరర్ కూరపాటి నాగేశ్వరరావు, ప్రేమాలయం గురాజీ టీవీఆర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ ప్రతాప శివకిషోర్‌కు అభినందన

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్‌ను ఏపీ మాజీ లిడ్‌క్యాప్ డైరెక్టర్, మిత్రదీప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సొంగా సందీప్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మంచి నడవడికతో ఉన్నత భవితకు బాటలు వేసుకునేలా విద్యార్థుల్లో చైతన్యం తెచ్చేందుకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. జిల్లాలో మరింత మెరుగైన రీతిలో ప్రజలకు సేవలు అందించేందుకు జిల్లా ఎస్పీ కృషి చేయాలని కోరారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఐలునాయకులు

ఏలూరు (టూటౌన్): కోల్‌కత్తాలో ట్రైనీ మహిళా వైద్యురాలిని హత్యచేసిన అసలు దోషుల్ని కఠినంగా శిక్షించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఏలూరు నగర కమిటీ జిల్లా కోర్టు ఆవరణలో మంగళవారం నిరసన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఐలు జిల్లా అధ్యక్షురాలు ఓరుగంటి శైలజ మాట్లాడుతూ మహిళా వైద్యుల రక్షణ చట్టం చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టే వరకు కేంద్ర ప్రభుత్వం స్పందిచక పోవడం బాధాకరమన్నారు. ఏలూరు నగర కార్యదర్శి గెద్దా విజయ భాస్కర్ మాట్లాడుతూ మహిళా వైద్యురాలిపై హత్యను ఖండించారు. ఐలు ఏలూరు నగర అధ్యక్షుడు పి.వెంకట్ మాట్లాడుతూ డ్రగ్స్, మాదక ద్రవ్యాలు లభ్యత లేకుండా చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్.కిషోర్‌కుమార్, ఆంజనేయులు, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

స్వాప్ డయేరియాపై అవగాహన



10వ డివిజన్‌లో ఫాగింగ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఏలూరు (టూటౌన్): స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లో భాగంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మలేరియా విభాగం వారితో కలిసి స్థానిక 10వ డివిజన్ లోని కుండి సెంటర్, నల్లమందు సందు, నున్నవారి సందు తదితర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమంతో పాటు దోమల నివారణకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. దోమల లార్వా నిర్మూలనకు స్ప్రేయింగ్, మురుగు కాలువ కల్వర్టు కింద ఫాగింగ్, ఖాళీ స్థలాల్లో ఉన్న నిలువ నీటిలో ఆయిల్ బాల్స్ వేయించామని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బచ్చు మురళి, మలేరియా ఇన్‌స్పెక్టర్ దత్తి వేణుగోపాలస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దేశానికి ఐటీని పరిచయం చేసిన రాజీవ్ గాంధీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): భారతదేశానికి చెందిన అనేక మంది ఐటీ దిగ్గజాలు ప్రపంచ దేశాలను శాసిస్తున్నారంటే దానికి కారణం దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ వేసిన బీజమేనని కాంగ్రెస్ నగర ప్రధాన కార్యదర్శి ప్రతాప సుబ్రహ్మణ్య శర్మ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. తొలుత రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బాలికలు అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇటీవల బాలికలపై దాడులు పెచ్చుమీరుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక యాదవ్ నగర్‌లోని సూర్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థినులకు గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌పై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. రత్నప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో బయట వ్యక్తులే కాకుండా పరిచయమైన వ్యక్తులతో అయినా బంధువులతో కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఉన్నత విద్యను అభ్యసించినప్పుడే పురుషులతో సమానంగా బాలికలు కూడా అభివృద్ధి చెందవచ్చని తెలిపారు. ఎటువంటి సమస్య వచ్చినా ఒక ఉత్తరం ద్వారా గాని లేదా 08812 224555కు ఫోన్ ద్వారా గాని సంప్రదిస్తే తగు న్యాయ సహాయం అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్లు కూన కృష్ణారావు, పి.వెంకటేశ్వరరావు, ఎ.గంగాభవాని, స్కూల్ ప్రిన్సిపాల్ కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.